చివరి ఆయకట్టుకు నీరు.. పచ్చగా పైర్లు



బ్లాక్-4 కింద చివరి వరకు కాల్వలో ప్రవహిస్తున్న నీరు

- పకడ్బందీ చర్యలు తీసుకున్న అధికారులు
- నీరు వృథా కాకుండా ఏర్పాట్లు
- వారబందీ పద్ధతిలో నీటి విడుదల

పాణ్యం: ఎస్సార్బీసీ అధికారులు పూర్తి స్థాయిలో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిచేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా నీటి వృథాను అరికడుతూ, నీటి విడుదలలో వారబందీ పద్ధతిని పక్కాగా అమలు చేస్తున్నారు. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో నీటి వినియోగం..

అధికారులు రైతులకు అవగాహన కల్పించి, నీటి వృథాను అరికడుతున్నారు. పైరుకు తగినంతగా నీటిని వాడుకొని, దిగువ పొలాలకు అందించేలా ఏర్పాట్లు చేశారు. కాల్వలకు నీరు చేరగానే రైతులు ఆయిల్ ఇంజిన్‌ల ద్వారా చకచకా నీటిని ఉపయోగించుకుంటున్నారు. పంటలకు అవసరమైన తరుణంలో కాలువకు నీరు రావడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు సమృద్ధిగా చేరుతుంది. ప్రస్తుతం మండలంలో ఏడు బ్లాక్‌లు ఉన్నాయి. వీటి కింద వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో సాగు చేస్తున్నారు.



కళకళలాడుతున్న మొక్కజొన్న పైరు

56,475 ఎకరాల ఆయకట్టు

ఎస్సార్బీసీ కింద 56, 475 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ఇందులో అధికంగా మొక్కజొన్న, మిరప, మినుము, పెసర పంటలను సాగు చేశారు. ఆయకట్టును ఏడుబ్లాకుగా విభజించారు. కాగా అధికారులు చివరి ఆయకట్టుకు నీరందేలా బ్లాకుల వారీగా వారబందీ ప్రకారం నీరు విడుదల చేస్తున్నారు. దీంతో సరైన వర్షాలు లేకపోయినప్పటికీ పంటలకు పుష్కలంగా నీరందరి కళకళలాడుతున్నాయి.

మండలంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ నుంచి బ్లాక్‌ల వారీగా వారబందీగా నీటి కేటాయింపు వివరాలు..

బ్లాక్‌నం	ఆయకట్టు (ఎకరాల్లో)	సాగునీరు వెళ్లే గ్రామాలు
1	16,930	దుర్వేశి,పాలూరు, చిలకల,గోరుకల్లు,కొండజూటూరు, ఉడుమల్పూర, బలపనూరు,కౌలురు, తొగర్చేడు, పుసులూరు, మద్దూరు,కొరటమద్ది, మునగాల, నంద్యాల, రాయమల్పూరం
2	3,814	బలపనూరు, చిలకల, కౌలురు, పాణ్యం
3	4,647	కౌలురు,నెరవాడ,పాణ్యం,తొగర్చేడు,భూపనపాడు,కొణిదేడు, మద్దూరు
4.	8,873	ఆలమూరు,గోనవరం,కొణిదేడు,అనుపూరు,భూపనపాడు, మద్దూరు, పాణ్యం
5.	4,325	ఆలమూరు,అనుపూరు,నందివర్గం,రామతీర్థం, కొత్తూరు
6.	4,718	బిరవోలు,చెరువుపల్లి,నందివర్గం,తిమ్మాపురం,జిల్లెల, కొత్తూరు
7.	13,168	అప్పలాపురం, నందవరం, విట్టలాపురం, టంగుటూరు చిన్నకొప్పెర్ల, వల్లంపాడు, జిల్లెల, గగ్గటూరు, రాయపాడు

సమయానికి నీరు వచ్చాయి

పంటలకు ప్రస్తుతం నీళ్ల అవసరం. అయితే రెండు రోజుల క్రితం కాల్వలకు నీళ్ల వచ్చాయి. అధికారులు సూచించిన రోజుల్లోపు నీటిని మళ్లించుకుంటున్నాం. ఆయిల్ ఇంజిన్ల సహాయంతో పంటలకు నీరు అందిస్తున్నాం. వర్షాలు సమృద్ధిగా కురువకున్నా వారబందిగా కాలువకు నీటిని అందిస్తున్నారు. నీటిని ఎక్కడా వృథా కాకుండా చూసుకుంటున్నాం. పొలాలకు సరిపడా నీటిని మళ్లించుకుంటున్నాం. అధికారులు సూచనల మేరకు చివరి ఆయకట్టుకు నీరు అందుతున్నాయి.

–ప్రతాప్‌రెడ్డి, నెరవాడ

దిగువకు పుష్కలంగా నీరు

నాకున్న ఐదెకరాల్లో ఈ ఏడాది ఆలస్యంగా పంటలు సాగు చేశా. కాల్వకు వారబందిలో భాగంగా నీరు వస్తుందని, పై నున్న గోరుకల్లు నీటి నిల్వ గురించి తెలియడంతో పంటలను వేశా. పైనుంచి నీరు ఆలస్యంగా విడుదల చేయడంతో మాకు మరింత ఆలస్యమవుతుందని అనుకున్నా.. కానీ వారబంది సక్రమంగా అమలు చేస్తుడడంతో చివరి ఆయకట్టు వరకు నీరు చేరుతుంది. ఐదవ బ్లాక్ చివరి ఆయకట్టు మా ఊరే.. ఎలాంటి నీటి సమస లేదు. వచ్చినా నీటిని పొదుపుగా వాడుకుంటున్నాం.

– మనోహర్, అనుపూరు

పార్టీ ఆదేశాలను పాటిస్తా

కర్నూలు(సెంట్రల్) : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాలను శిరసా వహిస్తానని జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు చెప్పా రు. శనివారం ఆయన డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అధిష్టానం డీసీసీ అధ్యక్షుడిగా తొలగించ డం ఏ మాత్రం బాధ కలిగించడం లేదన్నారు. పార్టీ నిర్ణయం మేరకు కార్యకర్తగా పనిచేస్తానని, పార్టీ పురోగతి కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కాగా, డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న సమయంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగుప్తా, నాయకులు బజారన్న, ఖాద్రీబాషా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

కల్లూరు: కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని (సీపీఐ) ఏపీ రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు మండలం చిన్నటేకూరు, పెద్దటేకూరు గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ వర్షాలు లేక జిల్లాలో అనావృష్టి వలన రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. పంటల సాగుకు పెట్టినపెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నెల 16న సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పుల్లన్న, సురేంద్ర యాదవ్, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్లస్టర్ వర్సిటీలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీలో మిగిలిపోయిన డిగ్రీ కోర్సుల సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య డి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ భాగసామ్య కాలేజీలైన కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీల్లో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు OAMDC వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490484188, 9849793821 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రైస్తవులు ఐక్యతతో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిప్సన్ చర్చి పాస్టర్ కృపాదానం

కర్నూలు (టౌన్): క్రైస్తవులు ఐక్యతను కలిగి ఉండి ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని గిప్సన్ సెంట్రల్ తెలుగు బాప్టిస్టు చర్చి పాస్టర్ కృపాదానం అన్నారు. శనివారం స్థానిక గిప్సన్ చర్చి ప్రాంగణంలో ఆ చర్చి 28 వ సిల్వర్ జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని గిప్సన్ చర్చిల క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ ఈనెల 19 వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గిప్సన్ చర్చిలో సంఘ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడల కార్యదర్శి మాధవరావు మాట్లాడుతూ అంతర్ చర్చిల పోటీల్లో భాగంగా క్రికెట్, హాకీ, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు వార్షికోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

డీడీ పాడులో అగ్నిప్రమాదం

కర్నూలు : కర్నూలు మండలం దిన్నెదేవరపాడు అంబేడ్కర్ కాలనీలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శనివారం అర్ధరాత్రి జయమ్మ, బాబురావు గుడిసెలు అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెకు నిప్పు పెట్టినట్లు బాధితులు అనుమానిస్తున్నారు. తిండి గింజలు, ఫర్నీచర్ మొత్తం మంటల్లో కాలి బూడిదయ్యాయి. ప్రమాదం చోటు చేసుకోగానే కర్నూలు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పక్క గుడిసెలకు తాకకుండా నీరు చల్లి అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదం వల్ల దాదాపు రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లి ఉండవచ్చునని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

సృజనాత్మకత నైపుణ్యాలు పెంచుకోవాలి



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు సిటీ: ప్రతి ఒక్క విద్యార్థి సృజనాత్మకత నైపుణ్యాలను పెంచుకోవాలని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ అన్నారు. ఈ నెల 9వ తేది నుంచి శనివారం వరకు మైపర్ కాలేజీలో నంది పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.జయ రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్,అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

షుగర్ జబ్బులపై నేడు రాష్ట్రస్థాయి సదస్సు

కర్నూలు(హాస్పిటల్): రీసెర్చ్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ డయాబెటీస్ ఇన్ ఇండియా నేతృత్వంలోని ఏపీ స్టేట్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి. శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ సీఎల్‌జీలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించే పలు ప్రసంగాల్లో నిష్ణాతులైన వైద్యులు పాల్గొని ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

నేడు 'భువన విజయం' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'భువన విజయం' నాటక ప్రదర్శన ఉంటుందని ఆ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. బనవాసి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థినులతో (బాలికలు) సీ క్యాంప్‌లోని తమ కళాక్షేత్రంలో నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కళాభిమానులు, కళా పోషకులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు శనివారం డ్యాం అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లో 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఇన్ ఫ్లో నిలిచిపోయిందని వెల్లడించారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రులు



కోడుమూరులో వెలసిన శ్రీవల్లెలాంబదేవి

కోడుమూరు రూరల్ : దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నుంచి కోడుమూరులో వెలసిన అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రుల మహోత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కోడుమూరులో వెలసిన శ్రీవల్లెలాంబదేవి, శ్రీకాళికాదేవి, శ్రీచౌడేశ్వరీ, శ్రీకన్యకాపరమేశ్వరీ, శ్రీగంగా మాత, శ్రీలచ్చమ్మ, శ్రీతులజా భవాని, శ్రీరాములమ్మ, శ్రీఅంబా భవాని ఆలయాలతో పాటు, గోరంట్ల శ్రీలక్ష్మీమాధవస్వామి ఆలయంలో ఈనెల 15నుంచి 23వతేదీ వరకు తొమ్మిదిరోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించనున్నారు.

శరన్నవరాత్రులను జయప్రదం చేయండి..

పాణ్యం : శ్రీ దేవి నవరత్రాలను జయప్రదం చేయాలని దేవదాయశాఖ ఈఓ లక్ష్మీనారాయణ శనివారం కోరారు. నవరాత్రుల సందర్భంగా పాణ్యంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అమ్మవారిని ప్రతి రోజూ ఓ రూపంలో అలంకరించి పూజలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 23వ తేదిన గ్రామోత్సవం ఉంటుందన్నారు.

దసరా ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

గూడూరు రూరల్ : మండల పరిధిలోని కె.నాగలాపురంలోని శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి గుడి పరిసరాల్లో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి ఇందులో భాగంగా శనివారం ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శ్రీదేవీశరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ పరిసరాలను శుభ్ర పరిచే పనులను చేపట్టినట్లు వారు. ఇప్పటికే ముఖద్వారం, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. గుడికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

నేటి నుంచి నవరాత్రోత్సవాలు

కె.నాగలాపురంలో కొలువైన గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీ దేవి దేవాలయంలో ఆలయ చైర్మన్ ఉమామహేశ్వరమ్మ, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి దసరా నవరాత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు శనివారం ఈఓ రాధాకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15న అమ్మవారిని బాలత్రిపుర దేవి అలంకరణ, 16న గాయత్రి దేవి, 17న అన్నపూర్ణదేవి, 18న మహాలక్ష్మిదేవి, 19న మహాచండి, 20న సరస్వతిదేవి, 21న లలితా త్రిపుర సుందరిదేవి, 22న దుర్గాదేవి, 23న విజ దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.



కె.నాగలాపురంలోని అమ్మవారి గుడి పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

విద్యుత్ ప్రమాదంలో ఒకరి మృతి


- ఐదుగురికి గాయాలు



మహమ్మద్ రఫీ (ఫైల్)

కల్లూరు: విద్యుత్ ప్రమాదంతో ఒకరు మృతి చెందగా పలువురుకి గాయాలైన ఘటన చిన్నటేకూరు సమీపంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చోటు చేసుకుంది. శనివారం పాఠశాలలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఫంక్షన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పాఠశాలలో పని చేస్తున్న వారందరూ ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా పాఠశాల ఆవరణలో బస్సు డ్రైవర్లు ఎస్.మహమ్మద్ రఫీ, నంది ఈశ్వర్, మధు వేణుగోపాల్, హుసేనయ్య, శీను, చిన్న మద్దయ్య జెండాలు పాతుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జెండా స్తంబం విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మహమ్మద్ రఫీ(40) మరణించాడు. మిగతా అయిదుగురికి గాయాలయ్యాయి. గాయాలైన వారిని కర్నూలులోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఈ సంఘటనపై ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్పను వివరణ కోరగా విచారిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల్లో విజ్ఞాన దృక్పథం పెంపొందించాలి




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో విజ్ఞాన దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉందని బీక్యాంప్ ప్రభుత్వ అత్యున్నత విద్య అధ్యయన సంస్థ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఆదినారాయణరెడ్డి అన్నారు. శనివారం కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ పరీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థులకు చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా సైన్స్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇది విద్యార్థులకు, సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షులు బీడీ సుధీర్ రాజు, కార్యదర్శి ఖాజా హుసేన్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 15 వేల మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సామర్థ్యాలు వెలికితీయడంలో జేవీవీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బడేసాహెబ్, జేవీవీ నాయకులు రమేష్, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు ప్రధాని ఊడిగం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి

కర్నూలు(సెంట్రల్): దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టి వారికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఊడిగం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి విమర్శించారు. శనివారం నగరంలోని సీ క్యాంపులో ఉన్న డ్రైవర్స్ అసోసియేషన్ భవనంలో సీపీఐ నగర స్థాయి సైద్ధాంతిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈశిక్షణ తరగతులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. .ప్రధానమంత్రి చౌకీదార్ అంటూ ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరిట ప్రజలను మభ్య పెడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె. జగన్నాథం, మహేష్, శ్రీనివాసరావు, గిడ్డమ్మ పాల్గొన్నారు.



తడకనపల్లె గ్రామ రోడ్డుపై ఏర్పడిన గుంతలు



రోడ్డు మధ్యలో పడిన ఎర్రమట్టి, రాళ్లు

అధికలోడు.. పాడైంది రోడ్డు

కల్లూరు: మండల పరిధిలోని తడకనపల్లె రహదారిలో నిత్యం భారీ వాహనాలు అధికలోడుతో వెళ్తుండటంతో ఆర్అండ్‌బీ రోడ్డు దెబ్బతింది. 44వ జాతీయ రహదారి నుంచి తడకనపల్లె గ్రామం వరకు అక్కడక్కడ రోడ్డు మధ్యలో, సైడ్లకు గుంతలు ఏర్పడ్డాయి. దీనికితోడు కంకర, ఎర్ర మట్టి లారీలు, ట్రాక్టర్లు అధిక స్పీడుతో ప్రయాణిస్తుండంతో ఎదురుగా వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఎక్కడ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉండటంతో భయంతో ప్రయాణం సాగిస్తున్నారు. ఎర్రమట్టి, కంకర రోడ్డుపై పడడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు అదుపు తప్పి కింద పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడ్‌తో వెళ్తున్న భారీ వాహనాలపై చర్యలు తీసుకుని రోడ్డును బాగు చేయించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు

కర్నూలు కల్చరల్: దసరా సెలవుల్లో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఉప గ్రంథ పాలకులు పెద్దక్క తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, బొమ్మల తయారీని నేర్పించడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు ఎస్టీయూ కార్యవర్గ సమావేశం

కర్నూలు సిటీ: ఎస్టీయూ జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం రేపు (సోమవారం) ఎమ్మిగనూరులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గోకారి, టి.కె. జనార్దన్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎమ్మిగనూరులోని సోమప్ప సర్కిల్ దగ్గర ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి పశ్చిమ రాయలసీమ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డితో పాటు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న, ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ గాజుల నాగేశ్వరరావు హాజరుకానున్నారన్నారు.

భక్తి శ్రద్ధలతో సింధూరార్చన పూజలు

కర్నూలు కల్చరల్: అమావాస్యను పురస్కరించుకుని శనివారం స్థానిక సూర్య నారాయణస్వామి ఆలయంలోని కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ఆకుపూజ, సింధూర అర్చన, తదితర పూజలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆయాలపై పనిభారం తగ్గించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలపై పనిభారం తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల విలీన ప్రక్రియలో తొలగించిన ఆయాలను తిరిగి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గాజాపై దాడులను ఖండించాలి

కర్నూలు(సెంట్రల్) : గాజాపై జియోనిస్టు ఇజ్రాయెల్ అణగారిక దిగ్బంధాన్ని ప్రపంచం ఖండించాలని ఎస్‌యూసీఐ పార్టీ జిల్లా ఇన్‌చార్జి వి.హరీష్‌కుమార్ రెడ్డి కోరారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఎస్‌యూసీఐ ఆధ్వర్యంలో గాజాపై దాడులను ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..దిగ్బంధంలో ఉన్న గాజా ప్రజలకు ఆహారం, నీరు, ఇంధనం సరఫరాలపై అమెరికా నిషేధం విధించడం అన్యాయమన్నారు. నాయకులు నాగన్న, తేజవతి, రోజా, ప్రియాంక, బాబు, అఖిల్, మల్లేష్, శక్రప్ప పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి కళ్లను కాపాడుకోండి



వృద్ధురాలికి కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ జయప్రకాష్

కర్నూలు(హాస్పిటల్): కాలుష్య వాతావరణం నుంచి కళ్లను కాపాడుకోవాలని లయన్స్ జిల్లా అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, బాలసాయి కంటి ఆసుపత్రి, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కల్లూరు ఎంఈఓ కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన ప్రజలకు డాక్టర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ప్రాక్టీషనర్ ఎండీ హసీనా, సత్యనిధి మెడికల్స్ ప్రొప్రైటర్ శ్రీనివాసరావు, ఇరుడైట్ ఫార్మాసిటికల్ ప్రొప్రైటర్ కె. రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దాం

- ఎమ్మెల్యే ఆర్థర్‌ను కలిసిన ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం నేతలు



ఎమ్మెల్యే ఆర్థర్‌ను కలిసిన సంక్షేమ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 20వ తేదీన విజయవాడ ఉండవల్లిలోని రాజగృహ ప్రాంగణంలో డా.బీఆర్ అంబేడ్కర్ పాలరాతి విగ్రహం, పాలరాతి మందిరం ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం నేతలు కోరారు. శనివారం సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌సీహెచ్ బజారన్న, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకటేష్ నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌ను కర్నూలులోని ఆయన నివాసంలో కలిసి కార్యక్రమ ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ పాలరాతి విగ్రహం, మందిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

16న అనెస్తీషియా డే వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశాల

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ఈ నెల 16వ తేదీన అనెస్తీషియా డే వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ విభాగం హెచ్ఓడీ డాక్టర్ జి. విశాల చెప్పారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలోని మోర్టాన్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కళాశాలలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రాంబాబు అనెస్తీషియా, క్రిటికల్ కేర్‌లో వచ్చిన మార్పులపై ప్రసంగిస్తారన్నారు. అనంతరం సాయంత్రం డాక్టర్స్ కాలనీలోని ఐఎంఏ భవన్‌లో సీఎంఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనెస్తీషియాలజి సొసైటీ ఏపీ జనరల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ రామశివనాయక్ మాట్లాడుతూ అనెస్తీషియాపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. లైఫ్ సపోర్ట్ సిస్టమ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో కర్నూలు సొసైటీ ఆఫ్ అనెస్తీషియాలజి అధ్యక్షుడు డాక్టర్ జె.సుధీర్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలసారయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈ–క్రాప్‌పై సోషల్ ఆడిట్, గ్రామసభలు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్‌లో నమోదు చేసిన పంటలు, రైతుల వివరాలను సోషల్ ఆడిట్‌కు పెట్టనున్నారు. సోషల్ ఆడిట్‌తో పాటు ఆర్‌బీకేల వారీగా గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు కూడా తీసుకోనున్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు సోషల్ ఆడిట్‌తో గ్రామసభలు నిర్వహిస్తారు. జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉన్నాయి. వీటన్నింటిలో పంటల నమోదుకు సంబంధించిన వివరాలను రైతులకు అందుబాటులో ఉంచుతారు. మరోవైపు గ్రామసభలు నిర్వహించి పంటల నమోదు వివరాలను బహిరంగంగా చదివి రైతులకు వినిపిస్తారు. ఏఏ రైతు.. ఎన్ని ఎకరాల్లో.. ఏఏ పంటలు సాగు చేశారనే దానిని గ్రామసభల్లో ప్రకటిస్తారు. నమోదు చేసిన పంటలపై అభ్యంతరాలు కూడా స్వీకరిస్తారు. ఈ నెల 23లోపు పంటల నమోదుపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరిస్తారు. 25న తుదిజాబితాను ఆర్‌బీకే వారీగా ప్రకటిస్తారు. ఈ–క్రాప్‌లో 10,09,865 ఎకరాల్లో సాగు చేసిన పంటలను నమోదు చేశారు. శనివారం సాయంత్రం సమయానికి ఈ–కేవైసీ 94.61 శాతం పూర్తి అయింది.